సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



మట్టి రోడ్లకు మహర్దశ

పల్లె ప్రాంతాల్లోని మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ఈజీఎస్ కింద భారీగా నిధులు మంజూరు చేసింది. 8లో



అభివృద్ధి పనులు పూర్తిచేయండి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన గిరిజన గ్రామాల్లో చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ సూచించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 19°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ చలి తీవ్రత తగ్గుముఖం పడుతుంది.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు వైభవోపేతంగా జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఎయిడ్స్‌పై కళాబృందాల అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చుంచుపల్లి: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం కూరగాయల మార్కెట్ సెంటర్‌లో కళాజాతా బృందాలు ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాకారులు ఎయిడ్స్ సోకే విధానం, వ్యాధి పట్ల అప్రమత్తత వంటి అంశాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జీవీఎల్ శిరీష మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఫైజ్ మొయినుద్దీన్, డీఎంపీఓ మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ టి.విజయకుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ సత్యకుమార్, రాజేంద్రప్రసాద్, సిబ్బంది రాణి, మధు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి ఎగ్జిట్లు ఇవ్వండి..



కేంద్ర మంత్రి గడ్కరీని సత్కరిస్తున్న ఎంపీలు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఉమ్మడి జిల్లా ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య మంగళవారం ఢిల్లీలో కలిసి జాతీయ రహదారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఖమ్మం–అశ్వారావుపేట జాతీయ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అంతర్భాగంగా నిర్మిస్తున్న ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో కల్లూరు మండలంలోని లింగాల, వేంసూరు మండలం వద్ద రెండు ఎంట్రీ, ఎగ్జిట్లు ఏర్పాటుచేయాలని కోరారు. లేకుంటే వేంసూరు, సత్తుపల్లి ప్రాంత ప్రజలు విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్ వెళ్లే క్రమంలో గ్రీన్ ఫీల్డ్ రహదారిని చేరుకోవడానికి 40 కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు.

కారులో కాక !



బీఆర్‌ఎస్‌లో భగ్గుమన్న అసమ్మతి

- పార్టీ గీత దాటుతున్న ప్రజాప్రతినిధులు
- 'అవిశ్వాసం'పై తగ్గేదే లేదంటున్న వైనం
- హద్దు మీరొద్దనే ఆదేశాలు బేఖాతర్
- ఎన్నికల ఏడాదిలో కొత్త సవాళ్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిన్నా మొన్నటి వరకు జిల్లాలో తిరుగులేని శక్తిగా కనిపించిన భారత రాష్ట్ర సమితికి ఇప్పుడు అసమ్మతి సెగ తాకుతోంది. గులాబీ నేతల్లో చోటు చేసుకున్న అసంతృప్తి ఎన్నికల ఏడాదిలో కారు గుర్తు పార్టీలో కాక పుట్టిస్తోంది.

నెల రోజుల్లోనే..

జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికగా భారత రాష్ట్ర సమితి భారీ బహిరంగ సభ నిర్వహించింది. పార్టీ అధినేత కేసీఆర్ అంచనాలను నిజం చేస్తూ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. దీంతో రాబోయే ఎన్నికల్లో గులాబీ పార్టీకి ఎదురులేదనే విశ్వాసం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కలిగింది. అయితే ఇది జరిగి నెల కూడా కాకముందే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికార పార్టీలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అయితే అసమ్మతి తారా స్థాయికి చేరుకుంటోంది. సామాన్య కార్యకర్తల సంగతి అటుంచితే.. కారు గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు సైతం పార్టీ లైన్ దాటేందుకు వెనుకాడడం లేదు. దీంతో ఎన్నికల ఏడాదిలో కొత్త సమస్య ఎదురైందనే భావన కేడర్‌లో నెలకొంటోంది.

మున్సిపాలిటీల్లో మొదలై..

స్థానిక సంస్థలకు సంబంధించి నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టడం సరికాదంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గతంలోనే చెప్పారు. ఈ మేరకు రూపొందించిన బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. అయినప్పటికీ అవిశ్వాసంపై అధికార పార్టీ కౌన్సిలర్లు వెనుకడుగు వేయడం లేదు. ఇల్లెందు మున్సిపల్ పాలకవర్గం కాలపరిమితి సగం ముగిసినప్పటి నుంచే చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుకు వ్యతిరేకంగా వైస్ చైర్మన్ జానీ ఆధ్వర్యంలో అసమ్మతి రాజుకుంది. ఇటు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు, అటు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు అసమ్మతి నేతలతో చర్చలు జరిపారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్టు కనిపించింది. అయితే ఇటీవల పాలక మండలి పదవీ కాలం మూడేళ్లు ముగియడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అవిశ్వాస తీర్మానం పేరుతో కలెక్టర్‌కు నోటీసు ఇవ్వడమే కాకుండా అసమ్మతి వర్గానికి చెందిన కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. వారికి పార్టీ కీలక నేతల అండదండలు ఉన్నాయనే వార్తలు రావడం గమనార్హం. మరోవైపు కొత్తగూడెం మున్సిపాలిటీలోనూ ఏడాది కాలంగా అసమ్మతి చెలరేగుతూనే ఉంది. ఇక్కడ అసమ్మతిని చల్లార్చేందుకు పార్టీ పరంగా జరుగుతున్న ప్రయత్నాలు నామమాత్రంగానే ఉన్నాయి.

మింగుడుపడని కోరం..

జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అసమ్మతి శిబిరంలో చేరిపోయి, పొంగులేటి వెన్నంటి ఉంటున్నారు. దీంతో కోరం కనకయ్యకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెడతారనే ప్రచారం జరిగింది. ఇంతలోనే ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో చైర్మన్లకు వ్యతిరేకంగా గులాబీ కౌన్సిలర్లే జట్టు కట్టారు. దీంతో 'అవిశ్వాసం' విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకోవడంలో బీఆర్‌ఎస్ పార్టీ అధినాయకత్వం ఇరకాటంలో పడ్డట్టయింది. దీంతో వేచి చూసే ధోరణి అవలంబించేందుకే పార్టీ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. అందువల్లే 'అసమ్మతి శిబిరంలో చేరినా, పార్టీ మారినా మీకే నష్టం' అనే నినాదానికే ఆ పార్టీ నాయకత్వం కట్టుబడి ఉంటోందనే అభిప్రాయం గులాబీ శ్రేణుల్లో నెలకొంది.

'తుమ్మల' సొంత మండలంలో..

అధికార బీఆర్‌ఎస్ పార్టీకి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కొత్త చిక్కులు వచ్చాయి. ఆయన నియోజకవర్గాల వారీగా తన అభిమానులు, అనుచరులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ సమావేశంలోనూ బీఆర్‌ఎస్ అధిష్టానం లక్ష్యంగా విమర్శలు చేస్తూ వస్తున్నారు. పొంగులేటి సమావేశాలకు వెళ్లరాదంటూ పార్టీ నుంచి గట్టి సందేశాలు అందుతూనే ఉన్నాయి. అందులో భాగంగా ఆ సమావేశాలకు వెళ్లే వారిపై సస్పెన్షన్లు విధిస్తున్నారు. అయినప్పటికీ అసమ్మతి, అసంతృప్తి తగ్గుముఖం పడుతున్న జాడలు అంతగా కనిపించడం లేదు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సొంత మండలమైన దమ్మపేటలో పొంగులేటి నిర్వహించిన సమావేశానికి కారు గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు పదుల సంఖ్యలో హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సభలో దమ్ముంటే తనపై చర్యలు తీసుకోవాలంటూ పొంగులేటి సవాల్ విసిరి, అసమ్మతిని రాగాన్ని తారాస్థాయిలో వినిపించే ప్రయత్నం చేశారు.

'క్యాంపు' రాజకీయం



మున్సిపల్ చైర్మన్ అనుకూల కౌన్సిలర్లతో ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

- వైజాగ్ శిబిరంలో అసమ్మతి కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పార్టీ పెద్దలు
- అసమ్మతి చల్లార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు
- అవిశ్వాసం ఎపిసోడ్‌లో ఖాకీల ఎంట్రీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఇల్లెందు: బొగ్గుట్ట పురపాలక సంఘం అవిశ్వాసం ఎపిసోడ్‌లో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెడుతున్న 15 మంది కౌన్సిలర్లలో 12 మంది ఏపీలోని విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన క్యాంపునకు తరలిపోయారు. మరోవైపు ఇల్లెందు మున్సిపాలిటీలో చెలరేగిన ముసలాన్ని చక్కదిద్దేందుకు ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తాతా మధు రంగంలోకి దిగారు. మంగళవారం రాత్రి 8:30 గంటలకు ఇల్లెందుకు వచ్చిన ఆయన, నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న మున్సిపల్ చైర్మన్ డీవీ, అతని మద్దతుదారులతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్ నాయక్‌తో సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు వారి మధ్య వాడీవేడి చర్చ జరిగింది.

పోలీసుల రంగప్రవేశం..

మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చర్చ జరుగుతుండగానే ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, సీఐ రాజు అక్కడికి చేరుకున్నారు. అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలంటూ తమను ప్రలోభాలకు గురి చేశారని డీవీ వర్గం కౌన్సిలర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అసమ్మతి శిబిరంలో ఉన్న ముగ్గురు మహిళా కౌన్సిలర్ల భర్తలపై చీటింగ్ కేసు నమోదైంది. ఓ వైపు పార్టీ పెద్దలు మాట్లాడుతుండగానే పోలీసులు రావడంతో అవిశ్వాసం ఎపిసోడ్‌లో తదుపరి మలుపు ఏంటనే చర్చ మొదలైంది.

బుజ్జగింపులు..

వైజాగ్ క్యాంపులో ఉన్న అసమ్మతి కౌన్సిలర్ల ఇళ్ల ఎదుట మంగళవారం ఉదయం అవిశ్వాసాన్ని వ్యతిరేకించేవారు ధర్నా చేస్తారంటూ ప్రచారం జరిగింది. అయితే చివరి నిమిషంలో వారు వెనక్కి తగ్గినట్టు సమాచారం. ధర్నాకు బదులుగా కౌన్సిలర్ల కుటుంబ సభ్యుల ద్వారా వైజాగ్ క్యాంపునకు ఫోన్లు చేసి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్ బుజ్జగింపులు సత్ఫలితాలు ఇవ్వకుంటే మరో విధంగా అసమ్మతిని చల్లార్చే ప్రయత్నం చేయాలనేది గులాబీ పెద్దల అభిప్రాయంగా ఉన్నట్టు తెలుస్తోంది.

కేటీఆర్ వచ్చేనాటికి పరిష్కారమయ్యేనా..

బస్ డిపోతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఈ వారం చివర్లో మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఇల్లెందులో పర్యటించే అవకాశం ఉంది. మంత్రి పర్యటనకు ముందు అసమ్మతి, అవిశ్వాసం వంటి వ్యవహారాలు ఇబ్బందిగా ఉంటాయనే భావన పార్టీ పెద్దల్లో నెలకొంది. దీంతో అసమ్మతి వర్గంతో జరుపుతున్న రాయబారాల తీవ్రతను పెంచారు. కేటీఆర్ వచ్చిన తర్వాత మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించడంతో పాటు స్పష్టమైన పరిష్కారం చూపిస్తామంటూ క్యాంపులో ఉన్న కౌన్సిలర్లను శాంతింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇల్లెందులో క్యాంపు రాజకీయాలు జోరుగా సాగుతుండగా స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అసెంబ్లీ సమావేశాల కారణంగా హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుంటూ చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు.

అభివృద్ధి చేస్తే అవిశ్వాసమా..?

ఇల్లెందు: బీఆర్‌ఎస్ పెద్దల సహకారంతో పట్టణాన్ని సమగ్రాభివృద్ధి వైపునకు తీసుకెళుతున్న తనకు 'అవిశ్వాసాన్ని' బహుమతిగా ఇస్తున్నారా అని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మూడేళ్లలో పట్టణంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని, తన సొంత పని కంటే ఎక్కువగా పట్టణాభివృద్ధికే శ్రమిస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, ఎమ్మెల్యే హరిప్రియ సహాయంతో పట్టణం అన్ని రంగాల్లో ముందుకు సాగేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి చేయడమే తాను చేసిన తప్పా అని ప్రశ్నించారు. బుగ్గవాగు ప్రక్షాళన, చెత్త సేకరణ వాహనాల ఏర్పాటు, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, హరితహారంలో ప్రకృతి వనాల ఏర్పాటు, రోడ్లపైనా, వార్డుల్లో మొక్కలు పెంపకం తదితర అనేక కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి శెభాష్ అనిపించుకున్నానని గుర్తు చేశారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు ఆలోచించాలని కోరారు.

అలరించిన 'స్వర్ణ కమలాలు'



స్వర్ణ కమలాలు నాటికలోని ఓ సన్నివేశం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


ముగిసిన అంతర్ రాష్ట్ర నాటికోత్సవాలు

భద్రాచలం: స్వచ్ఛమైన మనసు కలిగిన ప్రతి వ్యక్తీ ఒక స్వర్ణకమలమేననే అర్థాన్ని చాటిచెప్పిన 'స్వర్ణ కమలాలు' నాటిక కళాభిమానులను అలరించింది. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భద్రాద్రి కళాభారతి, తాళ్లూరి భారతీ దేవి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21వ అంతర్ రాష్ట్ర నాటికోత్సవ సాంస్కృతిక సంబురాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున హర్ష క్రియేషన్స్ విజయవాడ కళాకారులు స్వర్ణకమలాలు అనే నాటికను ప్రదర్శించారు. నాటికను విద్యాధర్ మునిపల్లె రచించగా, కత్తి శ్యాం ప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం గాయని రాణి పాడిన 'జానపద పాటల సంబరం' ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. జబర్దస్త్ ఫేం షరీఫ్ చేసిన మిమిక్రీ నవ్వుల పూలు పూయించింది. స్థానిక చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సైతం అందరినీ అబ్బురపరిచాయి.

కళలకు జీవం పోస్తాం

కళారంగానికి జీవం పోయడానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్ అన్నారు. అంతర్ రాష్ట్ర నాటికోత్సవ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రపంచ వ్యాప్తంగా భద్రాచలానికి ఉన్న ప్రాముఖ్యత ఈ నాటికోత్సవాలతో మరింత పెరిగిందన్నారు. ముగింపు సభలో తాళ్లూరి పంచాక్షరయ్య, గొట్టిపాటి అనితారాణి, సోమరౌతు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, తిప్పన సిద్దులు, హరిశ్చంద్ర నాయక్, కళాభారతి నిర్వాహకులు అల్లం నాగేశ్వరరావు, నర్సింహారావు, రామరాజు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కందులు అ'ధర'హో...



ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం కందులకు మద్దతు ధర కంటే అత్యధిక ధర పలికింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కందులు క్వింటాకు రూ.6,600 మద్దతు ధర ప్రకటించగా.. ఖమ్మం మార్కెట్‌లో రూ.7,002 ధర నమోదైంది. పలువురు రైతులకు ఈ ధర లభించగా... మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం పర్యవేక్షించారు. కంది సాగు ఆశించిన విధంగా లేకపోవటంతో పంటకు డిమాండ్ పెరుగుతోంద.ఇ వ్యాపారులు చెబుతున్నారు.

సమస్యలపై సమరభేరి !

- విద్యుత్ అదనపు చార్జీలతో ఆర్థిక భారం అంటున్న విపక్షాలు
- అప్రకటిత కోతలు ఆపాలని రైతుల ఆందోళన
- దిగుబడి తగ్గే ప్రమాదం ఉందంటున్న అన్నదాతలు



ఇల్లెందు మండలం కొమరారం సబ్‌స్టేషన్ ఎదుట ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సమస్యలపై జిల్లాలో ఒకవైపు వినియోగదారులు, మరోవైపు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెప్పపాటు కాలం కూడా సరఫరాకు అంతరాయం ఉండదని, రైతులకు నిరంతరం ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తుండగా.. వినియోగదారులు, రైతులు మాత్రం సమస్యలపై గళం విప్పుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో తమకు నష్టం కలిగించేలా అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని రైతుసంఘాల నాయకులు, రైతులు ఆందోళన చేస్తున్నారు. గత నెల రోజులుగా ఈ సమస్య నానాటికీ పెరుగుతోందని ఆరోపిస్తున్నారు. పంటలు ఎదిగే సమయంలో కోతలు విధిస్తే దిగుబడి తగ్గి, నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, సంబంధిత అధికారుల కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

48,511 వ్యవసాయ మోటార్లు..

జిల్లాలో విద్యుత్ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం 48, 511 వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం డివిజన్‌లో 38,442, భద్రాచలం డివిజన్ పరిధిలో 10,069 మోటార్లు ఉన్నాయి. జిల్లాలో విద్యుత్ వ్యవసాయ మోటార్లకు రోజుకు సరాసరి 0.96 మిలియన్ యూనిట్ల(ఎంయూ) విద్యుత్ వినియోగిస్తున్నారు. ఈ సంవత్సరం జనవరిలో యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో 114.04 ఎంయూల విద్యుత్‌ను వినియోగించగా, రోజుకు సరాసరి 3.68 ఎంయూగా నమోదైంది. గతేడాది డిసెంబర్‌లో వ్యవసాయ అవసరాలకు 102.66 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు.

గృహ విద్యుత్ కనెక్షన్లు 3,26,753..

ఇక జిల్లాలో వివిధ కేటగిరీల కింద 3,26,753 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం అదనపు చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మొత్తం వినియోగదారుల ఖాతాల్లోనే ఉంటుందని, కనెక్షన్ రద్దు చేసుకున్నప్పుడు తిరిగి ఆ డబ్బు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నా.. ఇలా వసూలు చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్‌ను ఎందుకు రద్దు చేసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.1000 చొప్పున ఏసీడీ చార్జీలు వేసినా జిల్లా ప్రజలపై రూ.30 కోట్లకు పైగానే భారం పడుతుందని, దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వినియోగదారులతో పాటు వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తున్నారు.

తరచూ కరెంట్ పోతోంది



ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోంది. ఇటీవలి కాలంలో ఇలా ఎప్పుడూ లేదు. విద్యుత్ సమస్య ఇలాగే ఉంటే పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి కోతలు లేకుండా చూడాలి.

– పోశం నాగేశ్వరరావు, రొంపేడు, ఇల్లెందు మండలం

అధికారిక కోతలు లేవు




జిల్లాలో అధికారికంగా విద్యుత్ కోతలు లేవు. ఎక్కడైనా స్తంభాలు, తీగలు పడిపోయినపుడు మరమ్మతు చర్యలు చేస్తున్నప్పుడు మాత్రమే సరఫరా నిలిపి వేస్తున్నారు. అది కూడా ముందుగానే ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నాం. గ్రిడ్‌లో సాంకేతిక సమస్య వచ్చినపుడు కూడా సరఫరాలో అంతరాయాలు ఉంటాయే తప్ప అధికారికంగా ఎలాంటి కోతలూ లేవు.

– రమేష్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ

ఎరుపెక్కిన మార్కెట్!

- ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి 56,644 బస్తాల మిర్చి
- ప్రస్తుత సీజన్‌లో ఇదే అధికం



మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చి బస్తాలతో నిండిపోయింది. ప్రస్తుత సీజన్‌లో అత్యధికంగా మంగళవారం 56,644 బస్తాల మిర్చిని రైతులు విక్రయానికి తీసుకురావడంతో యార్డులు ఎరుపెక్కాయి. పంట కోతలు జోరందుకోవటంతో విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. జిల్లా నుంచే కాక భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, హన్మకొండతో పాటు ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు కూడా ఇక్కడకు వస్తుండడంతో మార్కెట్ కళకళలాడుతోంది. గడిచిన ఇరవై రోజులుగా 30 నుంచి 40 వేల వరకు బస్తాల మిర్చి వస్తుండగా.. మంగళవారం ఒక్కసారిగా 56 వేలకు పైగా బస్తాలు విక్రయానికి రావడం విశేషం.

ధర పర్వాలేదు..

తేజా రకం మిర్చికి విదేశాల నుంచి ఆర్డర్లు ఉండటంతో కొద్ది రోజులుగా ధర నిలకడగా కొనసాగుతోంది. ఈనెల 1నుంచి ఖమ్మం మార్కెట్‌లో మిర్చి గరిష్ఠ ధర క్వింటాకు రూ.18,200గానే నమోదవుతుండగా, మోడల్ ధర రూ.17వేల నుంచి రూ.17,800 వరకు, ఇక కనిష్ఠ ధర రూ.12వేలు పలుకుతుండడంతో రైతులు అమ్మకానికి మొగ్గు చూపుతున్నారు. గత నెల క్వింటా ధర రూ.21వేలు దాటినా ప్రస్తుతం రూ.18వేల వద్ద నిలకడగా సాగుతోంది. అయినప్పటికీ కోతలు ఊపందుకోవడం, రైతులకు యాసంగి పెట్టుబడికి డబ్బు అవసరం ఉండడంతో అమ్మకానికే మొగ్గు చూపుతున్నారు. కాగా, మిర్చి విక్రయాలు పెరగటంతో మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఆశించిన ధర రాలేదు



మిర్చికి రూ.18 వేలకు పైగా ధర దక్కుతుందని 11 బస్తాలు తీసుకొచ్చా. పంట నాణ్యంగా ఉన్నా వ్యాపారులు రూ.17,700 చెల్లించారు. కమీషన్, ఖర్చులు పోతే రూ.17 వేలే చేతికొస్తాయి. రెండెకరాల్లో మిర్చి సాగు చేయగా, దిగుబడి 12 క్వింటాళ్లే వచ్చింది.

– భూక్యా చందు, బల్లునగర్ తండా, కారేపల్లి మండలం

రైతులు ఇబ్బంది పడకుండా పర్యవేక్షణ



మార్కెట్‌కు మిర్చి తీసుకొచ్చే రైతులు ఇబ్బంది పడకుండా పర్యవేక్షిస్తున్నాం. పంట దిగుమతి, జెండాపాట, కొనుగోళ్లు, కాంటాలు పెట్టించడంలో ఎక్కడా జాప్యం జరగకుండా చూస్తున్నాం. ఇక సాధ్యమైన మేరకు నాణ్యతా ప్రమాణాల ఆధారంగా రైతులకు మెరుగైన ధర దక్కేలా వ్యాపారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం.

– దోరేపల్లి శ్వేత, మార్కెట్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

చిరుధాన్యాలతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ లెనీనా

టేకులపల్లి: చిరుధాన్యాలతో తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి జేఎంఎస్ లెనీనా పేర్కొన్నారు. చిరుధాన్యాలతో చేసిన ఆహారం పంపిణీని అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో అమలుకు నిర్ణయించగా, మండలంలోని శంభునిగూడెం కేంద్రంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ జిల్లాలో టేకులపల్లి, బూర్గంపాడు, మణుగూరు, అశ్వారావుపేట, దమ్మపేట, పాల్వంచ, దుమ్ముగూడెం ప్రాజెక్టుల్లోని 1,058 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నెలల పాటు చిరు ధాన్యాలతో ఆహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ ఆహారం పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భట్టు భారతి, సీడీపీఓ కేఎం తార, మిల్లెట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మోహన్, లక్ష్మి, ఎం.నాగమణి, వి.కళావతి, వై.సుజాత, బి.సునీత పాల్గొన్నారు.

మండల పంచాయతీ అధికారిపై సస్పెన్షన్ వేటు

పినపాక: మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)ని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఎంపీపీ ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, డబ్బుల చెల్లింపులో అవినీతికి పాల్పడుతున్నారని, కార్యదర్శులను వేధింపులకు గురిచేస్తున్నారని.. ఎంపీఓను విధుల నుంచి తొలగించాలని తీర్మానం చేసి అధికారులకు పంపించారు. విచారణ చేపట్టిన అధికారులు ఎంపీఓను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక తరలింపు అడ్డగింత

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేట గ్రామంలోని ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లలో ఇసుకలోడ్ చేస్తుండగా ఏవీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాహనాలకు తాళం వేసి వాటిని వీఆర్ఏకు అప్పగించారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ రాత్రి వేళల్లో యంత్రాలతో ఇసుక తోడి అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వాహనాలను వీఆర్ఏకు అప్పగించామని చెప్పారు. కాగా, వాహనాలను డీటీ ప్రతాప్‌కు అప్పగించామని వీఆర్ఏ వెల్లడించారు. ఏవీఎస్పీ నాయకులు నూప సీతయ్య, సొందె మల్లూరు, కుర్సం రవి, కుర్సం మహేశ్, అశోక్, గొంది పూరిజగన్నాథ్ ఉన్నారు.

కబేళాకు తరలుతున్న పశువుల అడ్డగింత

అశ్వారావుపేటరూరల్: పొరుగు రాష్ట్రం నుంచి అక్రమంగా ఐషర్ వ్యాన్లలో తరలిస్తున్న పశువులను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన కొంతమంది వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఐషర్ వ్యాన్లలో 120 ఆవులను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా, వాహనాల తనిఖీల్లో స్థానిక రింగ్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. పట్టుకున్న వ్యాన్లను పోలీస్‌స్టేషన్లకు తరలించి పశువులను అక్రమంగా తరలిస్తున్న మస్తాన్, కొర్రా సునీల్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పట్టుబడిన ఆవులను పాల్వంచ వద్ద గల గోశాల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచ: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు మంగళవారం దాడి చేశారు. పట్టణంలోని వికలాంగులకాలనీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 వేల నగదు, 8 సెల్‌ఫోన్‌లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటేశ్

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సారపాక గ్రామానికి చెందిన సింగారయ్య, ఏనిక సారయ్య మంగళవారం రాత్రి కొలూరు గ్రామంలో సుతారి పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. కుర్నవల్లి గ్రామ ప్రధాన రహదారి సమీపంలో దుకాణానికి వెళ్లి ఇంటికి కాలినడకన వెళ్తున్న రేగా వెంకటేశ్‌ను వీరి బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్‌తో పాటు సారయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి అక్కడి నుంచి మణుగూరు ఆస్పత్రికి తరలించారు.

మట్టి రోడ్లకు మహర్దశ

- జిల్లాకు భారీగా సీసీ రోడ్లు మంజూరు
- 694 పనులకుగాను రూ.38.78కోట్లు
- మార్చిలోపు పూర్తి చేయాలని ఆదేశాలు
- కాంట్రాక్టర్లు ముందుకొచ్చేనా?



సీసీ రోడ్డుగా మారనున్న 4 ఇంక్లయిన్‌లోని మట్టి దారి..

చుంచుపల్లి: పల్లె ప్రాంతాల్లోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన మట్టి రోడ్లను సీసీ రహదారులుగా మార్చేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున జిల్లాకు నిధులను మంజూరు చేసింది. జిల్లాలోని పలు గ్రామాల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి తాజాగా రూ.38.78 కోట్ల నిధులను కేటాయించింది. జిల్లాలోని 19 మండలాల పరిధిలోని గ్రామాల వారీగా ఈ నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పించింది. ఒక్కొక్క మండలానికి పనుల నిమిత్తం రూ.25 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు ఉపాధి నిధులను మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యతను కల్పించనున్నారు. ప్రతి ఏడాది ఉపాధిహామీ పథకంలో క్రమం తప్పకుండా గ్రామాలకు నిధులను కేటాయిస్తుండటంతో ఎక్కువ శాతం అంతర్గత రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలోని దాదాపు 70 శాతం గ్రామాల్లో మట్టి రోడ్లు సిమెంట్ రహదారులుగా రూపుదిద్దుకున్నాయి. ఇంకా అక్కడక్కడా కొన్ని గ్రామాల్లో వెనుక బడిన కాలనీలు, గల్లీల్లో మట్టి రహదారులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఈ నిధులను సీసీ రోడ్లుగా మార్చడానికి ఉపయోగించనున్నారు. ప్రతి మండలంలో ఆయా గ్రామాలకు అవసరాన్ని బట్టి రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారంతో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు అవసరం ఉన్నాయో పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గుర్తించిన పనులకు జిల్లా కలెక్టర్ అనుమతులను సైతం పొందారు. మరి కొన్నింటికి అనుమతులు రావాల్సి ఉంది. ప్రస్తుతం మంజూరు చేసిన పనులను ఈ ఏడాది మార్చి 31 వరకు అనగా ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో సీసీ రహదారుల పనులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన ప్రారంభించేందుకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాకు 694 సీసీ రోడ్లు..

ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెల్లో అంతర్గత మట్టి రహదారులను ప్రతి ఏడాది సీసీ రోడ్లుగా మార్చుతున్నారు. జిల్లా ఏర్పడిన దగ్గర నుంచి ఇప్పటివరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ.170 కోట్ల వరకు నిధులను ఖర్చు చేశారు. ఇక తాజాగా 694 సీసీ రోడ్ల పనులకు గానూ ప్రభుత్వం రూ.38.78 కోట్లను ఇటీవల జిల్లాకు మంజూరు చేసింది. వీటిని భద్రాచలం, కొత్తగూడెం సబ్ డివిజన్‌లోని మండలాలకు విడివిడిగా కేటాయించారు. భద్రాచలం సబ్ డివిజన్‌లో 197 పనులకు రూ.8.36 కోట్లు, కొత్తగూడెం సబ్ డివిజన్‌లో 497 పనులకు రూ.30.42 కోట్ల చొప్పున మంజూరు చేశారు. అత్యధికంగా దమ్మపేట మండలానికి రూ.5.28 కోట్లతో సీసీ రోడ్ల పనులను చేపట్టనున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాల పనుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు అప్పగించింది.

వచ్చే నెల 31 వరకే గడువు

ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు ఈ సీసీ రోడ్ల పనులన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంది. గడువు లోపు పనులు ప్రారంభించి పూర్తి చేస్తేనే ఉపాధి హామీ పథకంలో వీటికి బిల్లులను సకాలంలో చెల్లించే అవకాశం ఉంది. లేని పక్షంలో మంజూరైన నిధులు తిరిగి వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. అయితే ఏడాది చివరలో ఒక్కసారి పనులు భారీగా మంజూరు కావడంతో అధికారుల్లో ఒకింత టెన్షన్ పట్టుకుంది. వీటిని చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ముందుకు రావడం ప్రతీసారి సమస్యగా మారుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పనులకు ముందుగానే పెట్టుబడి పెట్టి చేయాల్సి ఉంటుంది. ఒక వేళ పనులు చేసినా బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారు. గతేడాది సీసీ రహదారుల బిల్లులే ఇంకా రూ.14 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి కోసం సర్పంచులు ఏడాదిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాకు ప్రస్తుతం మంజూరైన 694 సీసీ రోడ్ల పనులను హడావుడిగా చేపట్టినా వాటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు ఎంతవరకు పాటిస్తారోననేది ప్రశ్నార్థకంగా మారింది.

పనులు త్వరగా చేపడతాం



జిల్లాలో సీసీ రోడ్ల కోసం భారీగా ఉపాధి నిధులు మంజూరయ్యాయి. మొత్తం 694 పనులకు గానూ రూ.38.78 కోట్లు కేటాయించారు. జిల్లాకు మంజూరైన ఈ నిధులతో 19 మండలాల పరిధిలోని గ్రామాల్లో పనులను గుర్తించాం. పనులు ఆలస్యం చేయకుండా వెంటనే సీసీ రోడ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వీటిని మార్చి 31 లోపు సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

–కె.సుధాకర్, ఈఈ, పంచాయతీరాజ్

‘హాత్ సే హాత్ జోడో’ యాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రోహిత్‌చౌదరి

కామేపల్లి(కారేపల్లి): జిల్లాలో ‘హాత్ సే హాత్’ జోడో పాదయాత్రను జయప్రదం చేయాలని ఏఐసీసీ జాతీయ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయరమణారావు కోరారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10న ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని పొన్నెకల్, బర్లగూడెంలలో పాదయాత్ర మొదలై ఇల్లెందు వరకు కొనసాగుతుందని తెలిపారు. యాత్రతో పాటు అదేరోజు సాయంత్రం జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు బానోతు వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గింజల నరసింహారెడ్డి, ధనియాల రామారావు, కంబాల ముసలయ్య, పులి సైదులు, డేనియల్, దేవానాయక్, లక్కినేని సురేందర్, దమ్మాలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోడలకు అంటిస్తే ఎలా.. నాకు చెప్పొద్దా?

- దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌తో బీఆర్ఎస్ నేత దురుసు ప్రవర్తన
- ఆవేదనతో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం



వివరాలు వెల్లడిస్తున్న సమత

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్(పర్యవేక్షకురాలు) రెంటాల సమత మంగళవారం ఉదయం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈమేరకు కారణాలను ఖమ్మంలోని కార్యాలయం వద్ద ఆమె మంగళవారం వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ గుడి ట్రస్ట్ బోర్డ్ విషయమై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు ఫోన్ చేసి దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. కమిటీ వేయొచ్చా అని ఆరా తీయగా.. రెండు నెలల క్రితమే నోటిఫికేషన్ ఇచ్చినా దరఖాస్తులు రాలేదని తాను చెప్పినట్లు వెల్లడించారు. అయితే, ‘విషయం నాకు చెప్పాలి కదా.. గోడలకు నోటీసులు అంటిస్తే ఎవరు చూస్తారు.. మాకు చెప్పకుండా సీక్రెట్‌గా చేస్తే ఎలా’ అని వేణు ప్రశ్నించారని.. రహస్యమేమీ లేదని చెబుతుండగానే చెప్పాల్సిన బాధ్యత మీదే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని వాపోయారు. తనను కసిరించుకోవద్దని, తాము జవాన్లం కాదని వివరించే ప్రయత్నం చేసినట్లు సమత తెలిపారు. అయినా ఆడకూతురినని చూడకుండా ఇష్టానుసారంగా మాట్లాడడంతో భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని మాత్రలు(బీపీ, న్యూరో) వేసుకున్నానని తెలిపారు. అయితే, అప్పటికే సమత మాత్రలు మింగి వచ్చినట్లు తెలియడంతో దేవాదాయ శాఖ ఉద్యోగులు ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత కలెక్టర్ గౌతమ్, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన, టీఎన్జీవోస్ ప్రతినిధులు ఆమెను పరామర్శించారు. అలాగే, ఉద్యోగులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో టీఎన్జీవోస్ నాయకులు ఆందోళన చేపట్టారు.

బెల్లం వేణుపై కేసు నమోదు

ఖమ్మంక్రైం: బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండలం అధ్యక్షుడు బెల్లం వేణుపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాదాయ శాఖ ఉద్యోగి సమతను వేధించగా ఆమె మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఖమ్మం ఆస్పత్రిలో సమతను పరామర్శిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఇన్‌స్పెక్టర్‌ను దుర్భాషలాడలేదు..

ఖమ్మం రూరల్: దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమతను తాను దుర్భాషలాడలేదని బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ అధ్యక్షుడు బెల్లం వేణు తెలిపారు. మారెమ్మతల్లి ఆలయ కమిటీ విషయమై ఈఓతో మాట్లాడితే నోటిఫికేషన్ రాలేదని చెప్పడంతో ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడానని చెప్పారు. అయితే, రెండు నెలల క్రితమే నోటిఫికేషన్ ఇచ్చామని ఆమె బదులివ్వగా, ‘ఇదేందమ్మా నోటిఫికేషన్ గురించి మాకెందుకు చెప్పలేదు, కనీసం మాకు సమాచారం ఇస్తే బాగుండేదమ్మా.. మీకు చెప్పే బాధ్యత ఉంది కదా’ అని అడిగానే తప్ప దుర్భాషలాడలేదని తెలిపారు. మండలంలో ఆదాయం మెరుగ్గా ఉన్న ఆలయాలకు కమిటీలకు ఏర్పాటు కాకుండా అడ్డుకుంటున్న ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య



జగన్నాథం మృతదేహం

గుండాల: సాగు చేసిన పంట ఆశించిన మేర దిగుబడి రాక పోవడం, తిరిగి యాసంగిలో సాగు చేసిన పంటలకు నీరందక ఎండిపోవడంతో మనస్తాపానికి గురైన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్న ఘటన గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈసం జగన్నాథం(40) వానాకాలం సీజన్‌లో మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆశించిన మేరకు పంట చేతికి రాకపోగా, రూ.లక్ష అప్పు అయింది. తిరిగి యాసంగిలోనూ మొక్కజొన్న పంటే వేశాడు. ప్రస్తుతం సరిపడా నీరందక పంట ఎండిపోయే స్థితికి చేరింది. దీంతో రెండోసారి సాగు చేసిన పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి కనపడడం లేదనే మనోవేదనకు గురయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. ఆ తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు గుండాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి...

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించిన కారణంగా, ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తొట్టిపంపు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూనెం పరమేశ్ (46) ప్రతీ రోజూ మద్యం సేవిస్తూ, ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో విసుగు చెందిన అతడి కుమారుడు పూనెం గణేశ్, భార్య తీవ్రంగా మందలించారు. మనస్తాపం చెందిన పరమేశ్ సోమ వారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సలహా మేరకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సోమవారం అర్ధరాత్రి మరణించాడు. మంగళవారం మృతుడి కుమారుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత



పట్టుబడిన టిప్పర్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్ కాలువల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం నకిరిపేట గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కాలువల మట్టిని అక్రమంగా జేసీబీలతో టిప్పర్లకు లోడింగ్ చేస్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. జేసీబీలను, టిప్పర్లను బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సురేశ్, బూర్గంపాడు ఎస్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: మణుగూరు మండలం ముత్యాలమ్మనగర్‌కు చెందిన తెన్నేటి సత్యవరచంద్ర (48) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మణుగూరు సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. స్థానిక సింగరేణి ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న సత్యవరచంద్ర పదిరోజుల కిందట తన ద్విచక్రవాహనంపై వెళ్తూ కూనవరం గేట్ వద్ద అదుపుతప్పి పడిపోయాడు. వెంటనే అతడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కేసులు నమోదు

భద్రాచలం: భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పలువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. కేసుల వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఏఎంసీకాలనీకి చెందిన తల్లీ, కుమార్తెలు చిట్టెమ్మ, నారీమణులు స్థలం విషయంలో ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ఓ మహిళ ఇంట్లోకి థామసయ్య అనే వ్యక్తి అక్రమంగా చొరబడి బెదిరించాడు. దీంతో మహిళ ఫిర్యాదుతో పోలీసులు థామసయ్యపై కేసు నమోదు చేశారు. కాగా, పట్టణానికి చెందిన ఓ రెగ్యులర్ వైద్యురాలు కలిపించడం లేదంటూ ఆమె భర్త చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మిర్చి అమ్మేందుకు వెళ్తూ మృత్యువాత

- రఘునాథపాలెం మండలంలో చెట్టును ఢీకొట్టిన వ్యాన్
- అక్కడికక్కడే టేకులపల్లి రైతు మృతి, మరో ఇద్దరికి గాయాలు



బూడిదంపాడు వద్ద బోల్తా పడిన మిర్చి వ్యాన్, (ఇన్‌సెట్) హనుమంతు (ఫైల్)

రఘునాథపాలెం/టేకులపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను అమ్ముకుందామని ఆ రైతు బయలుదేరాడు. పంట అమ్మగా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చొచ్చని ఆశించాడు. కానీ ఆ రైతు ఆశలను మధ్యలోనే రోడ్డు ప్రమాదం చిదిమివేసింది. మిర్చి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ రైతు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి రఘునాథపాలెం ఎస్ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలాల్లో పండించిన మిర్చిని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అమ్ముకునేందుకు వ్యాన్‌లో మంగళవారం తెల్లవారుజామున బయలుదేరారు. అయితే, రఘునాథపాలెం మండలం బూడిదంపాడు సమీపాన వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్‌పై కూర్చున్న భూక్యా హనుమంతు(45)పై వ్యాన్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు రైతులు భూక్యా బిచ్చా, భూక్యా కృష్ణకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, వ్యాన్ టైర్ పగలడమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. పంట అమ్ముకుని వస్తానని చెప్పి బయలుదేరిన రైతు హనుమంతు గంట వ్యవధిలోనే మృత్యువాత పడడంతో ఆయన కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. హనుమంతుకు భార్య హిరాణితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉండడంతో చిన్న కుమార్తె మౌనిక తలకొరివి పెట్టింది. పదిహేను సార్లకు పైగా అయ్యప్ప మాల ధరించిన ఆయన గురుస్వామిగా మండలంలో సుపరిచితుడు కావడంతో అంత్యక్రియలకు పలువురు హాజరై నివాళులర్పించారు.

చోరీల నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరుటౌన్: పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని మంగళవారం మణుగూరు పోలీసులు అరెస్టు చేశారు. మణుగూరు డీఎస్పీ ఎస్.రాఘవేంద్రరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీఎం బంజర్‌కు చెందిన తురపాటి ప్రసాద్.. మణుగూరు, పాల్వంచ, సూర్యాపేట ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, సీఐ వేణుచందర్, ఎస్ఐ సురేశ్, మణుగూరు సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐలు రాజ్‌కుమార్, పురుషోత్తం ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో ప్రసాద్‌ను అరెస్ట్ చేశారని డీఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 2 తులాల బంగారం, 2 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, పాల్వంచ, సుర్యాపేట పరిధిలో చోరీ చేసిన సుమారు 10 తులాల బంగారం త్వరలో స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రసాద్‌పై ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హసన్‌పర్తి, పాల్వంచ, మణుగూరు ప్రాంతాల్లో సుమారు 30 వరకు చోరీ కేసులున్నాయని, గతంలో హసన్‌పర్తి, ఖాజీపేట పోలీసులు అతడిపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపించారని చెప్పారు. జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ చోరీలు చేస్తున్నాడని, తాము నిఘా వేసి పట్టుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు. సమావేశంలో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమాపార్వతి ఆలయంలో చోరీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మద్దికొండ (భీమునిగూడెం) గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన గల ఉమాపార్వతి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానిక ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి సమయంలో ఆలయం తలుపు తాళాన్ని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. ఆలయంలో లోపల అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న సుమారు రూ.45 వేల విలువ గల 8 గ్రాముల బంగారు నాన్‌తాడు, మంగళ సూత్రాలను అపహరించారు. ఆలయంలో చోరీ జరగడం ఇది రెండోసారి. ఆలయ కమిటీ బాధ్యుడు కాసాని మురళి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

తిరుమల: వివిధ రకాల ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు టీటీడీ విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆన్‌లైన్ ఆర్జిత సేవలైన (వర్చువల్ పార్టిసిపేషన్) కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్ల కోటాతోపాటు, ఈ సేవల ద్వారా లభించే దర్శన కోటాను ఫిబ్రవరి 9న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎలక్ట్రానిక్ డిప్ పద్ధతిలో ఆర్జిత సేవా టికెట్ల నమోదు కోసం 8న ఉదయం 10 గంటల నుంచి ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఇతర ఆర్జిత సేవా టికెట్లను 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. https://tirupatibalaji.ap.gov.in ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య


రవిచరణ్(ఫైల్)

చెన్నారావుపేట: తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన ఓ బాలుడు ఉరేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. చెన్నారావుపేటకు చెందిన వీరమల్లు, రేణుక దంపతులకు రవిచరణ్(13), రవళి సంతానం. రవిచరణ్ చెన్నారావుపేట హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. వీరమల్లు నీరడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న రేణుక చికిత్స నిమిత్తం రెండ్రోజుల క్రితం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లింది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లాలని రవిచరణ్‌ను తండ్రి మందలించి తన పనికి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన కుమారుడు ఇంట్లో ఉరేసుకున్నాడు. రవళి గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడిని చికిత్స కోసం నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వీరమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

లక్షన్నర కోట్లు..

లక్షకుపైగా జాబ్స్

ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు 'ఎస్‌ఐపీబీ'గ్రీన్ సిగ్నల్
- ప్రత్యక్షంగా 1,03,075 మందికి ఉపాధి.. పరోక్షంగా మరిన్ని
- పలు భారీ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం



సాక్షి, అమరావతి: ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తద్వారా కొత్తగా 1,03,075 మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందనుండగా పరోక్షంగా మరింత మందికి ఉపాధి లభ్యం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ అనకాపల్లి జిల్లాలో రూ.1.10 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పే న్యూ ఎనర్జీ పార్కుతోపాటు కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు, పలు రంగాల్లో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమలు స్థాపించే వారికి చేదోడుగా నిలవాలని ఈ సందర్భంగా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తై కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ప్రతి పరిశ్రమలో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని మరోసారి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ప్రాజెక్టుల విధానంలో కీలక మార్పులు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితులు తీసుకొచ్చామన్నారు. విద్యుత్ ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్న భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు కింద చెల్లింపులు చేస్తారని, దీనివల్ల కరువు ప్రాంతాల్లో రైతులకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి మెగావాట్‌కు లక్ష రూపాయల చొప్పున రాష్ట్రానికి కంపెనీలు చెల్లిస్తున్నాయని తెలిపారు. ఎస్‌జీఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుందన్నారు. గ్రిడ్ బాధ్యతలు కూడా రాష్ట్రానికి లేవన్నారు. దీంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. భోగాపురంలో అత్యంత అధునాతన సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు కావాలని సీఎం జగన్ ఆదేశించారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎస్‌ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదనలు ఇవీ

- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కు ఏర్పాటు కానుంది. మొదటి విడతలో రూ.55 వేల కోట్లు, రెండో విడతలో మరో రూ.55 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడులతో తొలిదశలో 30 వేల మందికి, రెండో దశలో 31 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తంగా 61 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారు.
- కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా రూ.3,400 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2025 నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- శ్రీకాళహస్తి, పుంగనూరులో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ ఫ్యాక్టరీల స్థాపన ద్వారా డీఐ పైపులు, ఫెర్రో అల్లాయిస్ తయారీ. శ్రీకాళహస్తిలో రూ.915.43 కోట్లు, పుంగనూరులో రూ.171.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. మొత్తంగా రూ.1,087 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లు. ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వీటిని ఏర్పాటు చేస్తుంది. నాలుగు విడతల్లో మొత్తం రూ.10,500 కోట్ల పెట్టుబడుల ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- రామాయపట్నంలో అకార్డ్ గ్రూప్ రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కాపర్ కాథోడ్, కాపర్ రాడ్, సల్ఫూరిక్ యాసిడ్, సెలీనియం, ప్రత్యేక ఖనిజాల తయారీ ద్వారా ప్రత్యక్షంగా 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1489.23 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తిరుపతిలో నెలకొల్పే పరిశ్రమ ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కృష్ణా జిల్లా మల్లవల్లి పార్కులో ఇథనాల్ ఇంధన తయారీకి అవిశా, ఫ్యూయెల్స్ కంపెనీ ముందుకొచ్చాయి. మొత్తంగా రూ.498.84 కోట్ల పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,300 మందికి ఉపాధి లభిస్తుంది.
- విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. మొత్తం రూ.7,210 కోట్ల పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 14,825 మందికి, పరోక్షంగా 5,625 మందికి.. మొత్తంగా 20,450 మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 200 మెగావాట్ల డేటా పార్కుకి ఇది అదనం.
- భోగాపురంలో 90 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ఎస్‌ఐపీబీ ఆమోదం లభించింది.
- రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ తమ ప్రణాళికలను మార్చుకుంది. ఫ్యాక్టరీ కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన 985 ఎకరాల భూమిలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఎస్‌ఐపీబీ ఆమోదించింది.

సీబీఐ దర్యాప్తుపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకోండి అని వినతి
- డివిజన్ బెంచ్ ఆదేశాలపై సింగిల్ జడ్జి స్టే ఇవ్వలేరన్న పిటిషనర్ న్యాయవాదులు
- సీజే నుంచి స్పష్టత తీసుకోవాలని ఏజీని ఆదేశించిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే వరకు ఆ తీర్పు అమలును నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ దర్యాప్తు చేయాలంటూ ఇచ్చిన తీర్పును మూడు వారాలపాటు నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్ మంగళవారం ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, సీబీఐ దర్యాప్తు తీర్పును వారం రోజులైనా నిలిపివేయాలని కోరారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు (పిటిషన్‌ను విచారణకు స్వీకరించే వరకు) స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం మెరిట్స్‌లోకి వెళ్లలేదు కాబట్టి తమ లంచ్‌మోషన్ పిటిషన్‌లో సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రశ్నకు ఏజీ సమాధానమిచ్చారు. సీబీఐ దర్యాప్తును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వొచ్చని చెప్పారు. ప్రస్తుతం సిట్ విచారణ నిలిచిపోయిందని, ఈ పరిస్థితుల్లో సీబీఐ దర్యాప్తు చేసేందుకు అత్యుత్సాహం చూపడం సరికాదన్నారు. ఇప్పటికే సీబీఐ జేడీ ఫైళ్లు అప్పగించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారని, సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకుని స్టే ఇవ్వాలని కోరారు.

నేటి మధ్యాహ్నానికి వాయిదా..

ఈ కేసులో డివిజన్ బెంచ్ స్టే ఇచ్చిందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, సింగిల్ జడ్జి తీర్పు తర్వాత దర్యాప్తు కోసం సీబీఐ ప్రభుత్వంపై ఒత్తిడి చేయొద్దని ఉత్తర్వుల్లో స్పష్టంచేసిందని ఏజీ బదులిచ్చారు. ద్విసభ్య ధర్మాసనం అప్పీల్లోని మెరిట్స్ ఆధారంగా తుది ఉత్తర్వులు ఇవ్వలేదని, అప్పీల్‌కు విచారణార్హత లేదని తేల్చినందున సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చన్నారు. నిందితుల తరఫు సీనియర్ న్యాయవాదులు రవిచందర్, ప్రభాకర్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పాక స్టే కోసం సింగిల్ జడ్జి వద్దకు ప్రభుత్వం రావడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని, సింగిల్ జడ్జి స్టే ఇవ్వడానికి ఆస్కారం లేదని వాదించారు. సింగిల్ జడ్జి తీర్పుపై సీజే బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేస్తే తీర్పు వచ్చిందని, ఇప్పుడు మళ్లీ అదే సింగిల్ జడ్జి వద్దకు స్టే కోసం ఎలా వస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేవరకు ఆదేశాలను నిలుపుదల చేయడానికి ద్విసభ్య ధర్మాసనం నిరాకరించిందని గుర్తుచేశారు. సిట్ దర్యాప్తు చేయాలని భావించడమూ అత్యుత్సాహం కిందకే వస్తుందని చెప్పారు. వాదనలు విన్న తర్వాత జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు తర్వాత స్టే కోసం సింగిల్ జడ్జిని ఆశ్రయించవచ్చో లేదో చీఫ్ జస్టిస్ నుంచి స్పష్టత తీసుకుని చెప్పాలని ఏజీని ఆదేశించారు. బుధవారం సీజే బెంచ్ వద్ద స్పష్టత తీసుకుని చెబుతామని ఏజీ చెప్పడంతో విచారణను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు.

ఎమ్మెల్యేల ఎర కేసులోకి సీబీఐని రానీయొద్దు

- పిటిషన్‌ను త్వరగా విచారించాలి
- సీజేఐ ముందు ప్రస్తావించిన తెలంగాణ తరఫు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తులోకి సీబీఐని రానీయొద్దని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ప్రస్తావించారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను త్వరగా విచారించాలని అభ్యర్థించారు. సీబీఐ దర్యాప్తు చేస్తే కేసు నీరుగారిపోతుందని చెప్పారు. అనంతరం, ఇదే విషయాన్ని బుధవారం మెన్షన్‌లో ప్రస్తావించాలని సీజేఐ సూచించారు. 'వచ్చే వారంలో విచారణ జాబితాలో చేర్చుతాం. మరోసారి బుధవారం ప్రస్తావించండి'' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: ఖమ్మం రీజియన్‌లోని నాలుగు గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ, ఎంఫిల్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ బోధనకు 19 మందిని నియమించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈ నెల 10న సాయంత్రం ఐదు గంటల్లోపు భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో దరఖాస్తు అందజేయాలని పీఓ సూచించారు.

మిరప కోతల్లో జాగ్రత్తలు పాటించాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): మిరప సాగు చేసే రైతులు కోతల సమయాన తగిన జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. కాయలను మొక్కలపై ఎక్కువగా పండనివ్వొద్దని, అలా జరిగితే మిరపకాయల నాణ్యత తగ్గుతుందని తెలిపారు. అధిక దిగుబడి కోసం చెట్టుపై పండే దశకు వచ్చినకాయలను ఎప్పటికప్పుడు కోసి పట్టాలపై ఆరబెట్టుకోవాలని పేర్కొన్నారు. అలాగే, మిరప కాయలు కోసేముందు మందులు పిచికారీ చేయొద్దని వివరించారు.

బిల్ కలెక్టర్లకు ఆధునిక యంత్రాలు


బిల్ కలెక్టర్లకు యంత్రాలు అందజేస్తున్న ఆర్‌ఓ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బిల్ కలెక్టర్లకు కొత్తగా పది హ్యాండ్ హెల్డ్ మిషన్లను మంగళవారం ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు అందజేశారు. ఇప్పటికే పన్నుల వసూళ్లకు 14 మిషన్లు అందుబాటులో ఉండగా ఏటీఎం కార్డుల ద్వారా బిల్లు చెల్లించే వెసలుబాటు లేదు. దీనికి తోడు కేఎంసీకి కేటాయించిన పది మంది వీఆర్వోలను రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లుగా నియమించినా యంత్రాలు లేవు. దీంతో కేఎంసీ అధికారులు డిజిటల్ యంత్రాలను కొనుగోలు చేశారు. వీటిలో చెల్లింపుదారుల పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉండడమే కాక ఫోన్‌పే, గూగుల్ పేతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బిల్లు చెల్లించేందుకు వెసలుబాటు కలగనుంది.

జిల్లా వార్తలు

సత్వర న్యాయానికే లోక్ అదాలత్

- ఇక్కడి తీర్పుతో శాశ్వత, అంతిమ పరిష్కారం
- పెండింగ్ కేసుల పరిష్కారానికి రాజమార్గం
- ఎక్కువ కేసులు పరిష్కరించేలా సదస్సులు


లోక్‌అదాలత్‌లో కేసు రాజీ సందర్భంగా న్యాయవాదికి మొక్క బహూకరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు(ఫైల్)

ఖమ్మంలీగల్: కోర్టు కేసుల పరిష్కారంలో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రత్యామ్నాయ మార్గంగా లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అటు న్యాయస్థానాలు, ఇటు న్యాయమూర్తులు సరిపడినంతగా లేకపోవడంతో అనేక కేసులు అపరిష్కృతంగా ఉంటున్నాయి. ఈ కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానం ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా లోక్‌అదాలత్‌లను ప్రవేశపెట్టింది. కక్షిదారులకు జాప్యం లేకుండా.. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయసేవాధికార చట్టాన్ని రూపొందించి కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృథా కాకుండా చూస్తూనే శాశ్వత అంతిమ పరిష్కారాన్ని ఈ లోక్‌అదాలత్ ద్వారా అందిస్తున్నారు. ఈనెల 11న జాతీయ లోక్‌అదాలత్ జరగనున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

న్యాయసేవాధికార చట్టం ద్వారా..

న్యాయసేవాధికార చట్టాన్ని 1987లో ప్రవేశపెట్టగా, పేదలకు న్యాయసాయం అందించేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులు, కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. కేవలం డబ్బు ఉన్న వారికే న్యాయం సొంతమనే అపోహను తొలగించేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 39వ అధికరణం ద్వారా పార్లమెంట్ ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతీ మనిషికి సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడం ఈ సంస్థ లక్ష్యం. ఇక దేశంలో ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతిని అనుసరించి ప్రభుత్వం లోక్‌అదాలత్‌లను చట్టరీత్యా ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ చట్టం, న్యాయంపై అవగాహన లేక ఇబ్బంది పడుతున్న సామాన్యులకు అవగాహన కల్పించి సత్వర న్యాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీలు కృషి చేస్తున్నాయి. న్యాయసేవాధికార చట్టంలోని 9వ అధికరణం ప్రకారం ఉభయులకు నచ్చజెప్పి వారి సమ్మతితో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల కేసులను రాజీ మార్గం ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు వీలు ఏర్పడింది.

చట్టం పరిధిలో..

న్యాయసేవాధికార చట్టం పరిధిలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉన్నత న్యాయస్థాన న్యాయసేవాధికార సంఘం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార సంఘం, ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్‌అదాలత్‌లు పనిచేస్తూ న్యాయసేవలను అందిస్తున్నాయి. ప్రజలు న్యాయం పొందడంలో ఎలాంటి అసమానతలు అడ్డుకాకుండా.. పేదలకు ఉచిత న్యాయసాయం అందించి, న్యాయస్థానాల్లో న్యాయం పొందేందుకు ఈ సంస్థలు సహకరిస్తాయి. సుహృద్భావ వాతావరణంలో ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన అంతిమతీర్పును అందించేందుకు లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నారు.

అర్హతలు

న్యాయసేవల అధికారిక చట్టం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఈ చట్టం నిర్దేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలు, నిర్దేశకాలను రూపొందించారు. ఈ చట్టం ప్రకారం షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారు, మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు, మహిళలు, పిల్లలు, మతిస్థిమితం లేనివారు, అవిటివారు, సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులలో చిక్కుకున్నవారు, పారిశ్రామిక కార్మికులు తదితరులు అర్హులు. వీరు ఈ చట్టం ద్వారా ఉచితంగా సాయం పొందవచ్చు. వీరే కాక రూ.లక్ష వార్షికాదాయం మించని వారూ ఉచిత న్యాయసాయానికి అర్హులే.

దరఖాస్తు ఇలా..

ఉచిత న్యాయసాయం కోరే వారు జిల్లా కోర్టుల్లో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థలకు లేదా రాష్ట్ర హైకోర్టులోని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు కానీ కేసుల వివరాలను తెలుపుతూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న కేసులు పరిశీలించి అవసరమైతే దరఖాస్తుదారుడి తరఫున న్యాయవాదులను నియమించి కేసులు చేపడతారు. న్యాయసాయం పొందిన వారికి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన ఖర్చులు భరిస్తారు. అలాగే, కేసుల్లో తీర్పు కాపీలు ఉచితంగా అందిస్తారు.

న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: జిల్లా కోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో మెజిస్ట్రేట్ కోర్టులతోపాటు అదనపు జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉండడంతో కేసులు ముందుకు సాగడం లేదని తెలిపారు. మూడో అదనపు మెజిస్ట్రేట్, మొబైల్ కోర్టు, పోక్సో కోర్టులు, మహిళా కోర్టుకు న్యాయమూర్తులను నియమించాలని కోరడంతో పాటు ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో న్యాయమూర్తుల నివాస భవనాలు, జిల్లా కోర్టులో రికార్డు రూం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాళ్లూరి లక్ష్మీనర్సింహారావు, తోటకూరి శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా), విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 9న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎస్ఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని, మండల స్థాయి పరీక్షలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారితో గైడ్ టీచర్లు హాజరుకావాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటే విద్యార్థులను ఈనెల 13 జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఇంజనీరింగ్ అభివృద్ధి పనులు పూర్తిచేయండి

- గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణంపై దృష్టి
- సమీక్షలో ఐటీడీఏ పీఓ గౌతమ్


అధికారులతో సమీక్షిస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఐటీడీఏ నిధులతో గిరిజన గ్రామాల్లో చేపడుతున్న ఇంజనీరింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల అధికారులతో సమావేశమై మాట్లాడారు. చర్ల మండలంలోని నారాయణపురం, వైరా, సుదిమల్ల కొమరారం, లక్ష్మీనగర్ తండాల్లో రోడ్లు, తిరుమలాయపాలెంలో రెసిడెన్షియల్ పాఠశాల ప్రహరీ, వైరాలో గిరిజన భవనం, ఖమ్మం పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయించాలని, కోయగూడెంలో సబ్‌సెంటర్ నిర్మాణం పూర్తిచేసి వైద్యాధికారులకు అప్పగించాలని తెలిపారు. ఇంకా గేట్ కారేపల్లి, మామిడిపల్లి, పెద్ద మెడిసిలేరు, కూర్నపల్లి, అశ్వారావుపేట, పూసుకుంట, భద్రాచలంలో పనులపై కూడా దృష్టి సారించాలని సూచించిన ఆయన.. నాణ్యత విషయంలో ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మారుమూల గ్రామాలకూ రోడ్డు సౌకర్యం

మారుమూల ఆదివాసీ, గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేలా ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీఓ గౌతమ్ సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడమే కాక, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. భూ బదలాయింపులో ఆటంకం కలగకుండా చూడాలన్నారు. సమావేశాల్లో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీతో పాటు అధికారులు రాములు, శ్రీకాంత్, హరీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర కమిషనర్ శంకర్‌నాయక్



సదస్సులో పాల్గొన్న కమిషనర్ శంకర్‌నాయక్, పక్కన కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మంసహకారనగర్: సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్‌నాయక్ సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం ఇచ్చే ఉద్యోగుల వివరాలు ప్రదర్శించాలని, దరఖాస్తు అందిన 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. అలా చేయలేని పక్షంలో జిల్లాల వారీగా విచారణ చేపడుతామని చెప్పారు.

కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ ప్రతీ ఫైల్‌కు సంబంధించిన రికార్డ్‌ల సరైన పద్ధతిలో నిర్వహించడం ద్వారా పరిష్కారం సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ - ఆఫీస్ విధానంలో ఫైళ్లు నిర్వహిస్తే కూడా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, డీఆర్వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై విచారణ

జిల్లాలో సమాచార హక్కు కింద పెండింగ్‌లో ఉన్న 23 కేసులపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్‌నాయక్ కలెక్టరేట్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

జాతరకు రూ.10 లక్షల విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం అంకమ్మ జాతర నిర్వహణకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఇటీవల మండల కేంద్రానికి మంగళవారం వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు కలిసి జాతర నిర్వహణపై వివరించారు. దీంతో ఎమ్మెల్యే భారీ విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఈవూరి శ్రీనివాసరెడ్డి, ఆకుల వెంకటేశ్వర్లు, పగిడిపత్తి శ్రీనివాస్, యడవల్లి చంద్రయ్య, ఆకుల మల్లేష్, చంద్రారెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని జర్నలిస్టు ప్రతినిధులు వినతి పత్రం ఇవ్వగా, ఇటీవల ప్రమాదంలో గాయపడిన నేలకొండపల్లికి చెందిన మాదాసు ఆదాంను ఎమ్మెల్యే పరామర్శించారు.